**కథ**

# ఆచంద్ర తారార్కంగా...

- వాడ్రేవు రమాదేవి

'ఆశను జయిస్తే గొప్పవాళ్ళే!"

"అదేమిటి నాన్నా! అలా అంటారూ?"

తీరిగ్గా పడక్కుర్చీలో కూర్చుని, పేపరు తిరగేస్తూ అన్నారు రామారావు తండ్రి దశరథరామయ్య.

"అయితే ఆశను జయించలేని వాళ్ళ జీవితాలు దుఃఖ భాజనమే నంటారా?"

"నిస్సందేహంగా! దాని వలన శోకం కాకపోతే మరేం మిగులుతుందీ!" ముక్కుపొడుం ఎగబీలుస్తూ అన్నారు దశరథరామయ్య. తండ్రి మాటలు రామారావు జీవితాన్ని తట్టి లేపినట్లయింది. ఈ మాటను తండ్రి అప్పుడే తనకు చెప్పి వుంటే...

ఏమో! తను వాటి అర్థాన్ని గ్రహించే స్థితిలో లేడు అనాడు.. చేతులు కాలాక ఆకులు... అంటే ఇదేనేమో!

❖ ❖ ❖

"తాతయ్యా! ఓ తాతయ్యా! ఆడవాళ్ళు అన్నిట్లోనూ ముందు వుంటున్నారట కదా! అవన్నీ వట్టి నోటిమాటలే గానీ, చేతల్లో ఏమీ ఉండటం లేదు తాతయ్యా!" అంటూ పుస్తకాలు విసురుగా బల్లమీద పడేస్తూ అంది శైలజ.

"వస్తూనే ఎందుకింత కోపమమ్మా? ఏమిటి ముఖం అంతా కందగడ్డ చేసుకున్నావు?" మనవరాలికి కోపం వచ్చిందని గ్రహించారు దశరథరామయ్య.

"చూడు రాముడూ! నా మనవరాలు ఏమంటోందో? నువ్వే చెప్పు. ఆడవాళ్ళు రైళ్ళు నడుపుతున్నారు, విమానాలు నడుపుతున్నారు.. ఒకటేమిటి ఇందుగల రందు లేరని సందేహం వలదు, ఎందెందు వెతికిన అందందే కలరు ఆడవారు.." అన్నట్లుగా అన్నిటిలోమా ఉంటున్నారు కదా!" తండ్రి ధోరణికి అడ్డుకట్ట వేస్తూ- "ఇంతకీ ఏం జరిగిందో చెప్పమ్మా!" అన్నారు రామారావు గారు.

"ఈ రోజు బస్టాపులో జనం చాలా ఎక్కువగా ఉన్నారు. బస్సు స్టాపులో ఆగగానే జబ్బ సత్తువ వున్న వాళ్ళందరూ ముందుగా ఎక్కేసారు. నాలాటి వాళ్ళు వెనకగా ఎక్కారనుకో. రెండు స్టాపుల తర్వాత జనం తగ్గారు బస్సులో. ఒకతని ప్రక్కసీటు ఖాళీ అయ్యింది. వెనుక వరుసలో కూర్చున్నతన్ని ఆ సీట్లో కూర్చోమన్నాను. అతనికి ఈ వ్యవహారం నచ్చలేదు. "నేనెందుకు కూర్చో వాలి? అసలు నేనెందుకు లేవాలి? మీరే కూర్చోవచ్చు కదా అక్కడ?" అన్నాడు మొండిగా. "అంత మూర్ఖంగా సమాధానం చెప్తాడని అనుకోలేదు. నాకు అవమాన మనిపించింది. "అక్కడెట్లా కూర్చుంటాను? మీరు కూర్చుంటారేమోనని అడిగాను. ఇష్టం లేకపోతే పోనీ యండి" అన్నాను బింకంగా.

"ఇదంతా కండక్టరు చూస్తూ కూడా నోరు మెదప లేదు. ఇట్లాంటివి రోజూ ఎన్ని చూస్తానో.. అన్నట్లుగా వుండిపోయాడు.

"బస్సులో జనం రెండు పార్టీలయిపోయారు. 'మగాళ్ళయినంత మాత్రాన లేచి ఈ ఆడవాళ్ళకు సీట్లివ్వాలా? ఇదెక్కడి రూలు? వీళ్ళ నుంకుమారాలు మరీ ఎక్కువైపోతున్నాయి! మళ్ళీ అన్నిట్లో సమానత్వం అంటూ ఉంటారు', అనే పురుష కంఠాలు కొన్ని.

"ఈ రోజుల్లో స్త్రీలకు గౌరవం తగ్గిపోయింది. ఒక మగాడి ప్రక్కన కూర్చోమంటాడే మమ్మల్ని! వాడికెంత పొగరు! వాళ్ళింట్లో ఆడవాళ్ళు లేరా? చదువున్న వాళ్ళకి కూడా ఇదే జబ్బు! ఏం చదువులవి తగలెయ్యనా? సంస్కారం నేర్పని చదువులు.." అంటూ ఆడవాళ్ళ ఛీత్కరింపులు మరోవైపు.

"ఇంతకూ నువ్వు కూర్చున్నావా? లేదా చెప్పమ్మా?" తాతయ్య ఆదుర్దా.

"కూర్చున్నాలే తర్వాత, అయినా మన దేశ సంస్కృతి ఇంతగా సన్నగిల్లిపోతేందేమిటి? ప్రతీ రోడ్డు పక్కన గాంధీ బొమ్మలు, అంబేద్కర్ విగ్రహాలు వెలుస్తూనే వుంటాయి. వాళ్ళు దారి చూపిస్తూనే వుంటారు తమ వేలు పెట్టి. వాళ్ళ వర్ధంతులు, జయంతులు జరుపుతూ, దండలు వేస్తూ ఉంటారు. అంతవరకే తెలుసు కానీ, వాళ్ళ హితబోధలు గురించి పట్టించుకునే వాళ్ళేవుండరు. ఆ దండలకి మెచ్చి వాళ్ళేమన్నా వరాలు ఇస్తారనేఆశేమో ఈ వెర్రిజనానికి!"

"శైలూ! నీ ఆవేశం తగ్గించుకో. ఇది నీ కాలేజీలో స్టేజీ కాదు. లోపలకు వెళ్ళి టిఫిను తిను!" రామారావు గారు కూతుర్ని కసిరారు.

"అది కాదు నాన్నా! నాకు ఒళ్ళు మండిపోతోంది. స్త్రీగా కాకపోయినా, సాటి మనిషిగా గౌరవించాలనే ప్రాథమిక సూత్రం చెప్పి ఈ తరం యువకుల అజ్ఞానాన్ని వదిలించడమెట్లా?" రామారావుకు ఈ మాటలు ఎక్కడో, ఎవరో అన్నట్లుగా ఉలికిపడ్డారు. అంటే తరాలు మారినా ఈ ప్రశ్న అలా ఉత్పన్నమవుతూనే వుంటుంది. దీనికి పరిష్కారం.. ఇంక ఆపై ఆలోచించ లేకపోయాడు రామారావు. 'శైలూ! నీ బాధను అర్థం చేసుకున్నానమ్మా! స్త్రీకి రక్షణ కరువై పోతోంది" సానుభూతిగా అన్నాడు రామారావు. రామారావు ఆత్మ మాత్రం ఇది శుద్ధ అబద్ధం! నువ్వు నిజంగానే, మనస్ఫూర్తిగానే ఈ మాట అంటున్నావా? అటూ నిలదీసింది.

"ఒరే అబ్బాయి! నేనుచెప్తూనే ఉన్నా.. కానీ మీ తండ్రీకూతుళ్ళు వినిపించుకోలేదు. ఇప్పటికైనా తెలిసి వచ్చిందిగా! రేపట్నుంచీ శైలుని కార్లో పంపు. బస్సులో అవస్థ పడలేదు,' అన్నారు తాతయ్య ముక్కుపొడుం బిగిస్తూ.

"అబ్బా! నీ ముక్కుపొడుం పట్టు మానమంటే మానవు కదా! అది వేసుకుని తుమ్మి తుమ్మి ఇల్లంతా గలీజు చేసేస్తున్నావు తాతయ్యా!"

"ఇదిగో నువ్వు నా ముక్కుపొడుం జోలికి రావద్దని చెప్పానా! ఇప్పుడు నా మీద దండయాత్ర మొదలు పెట్టావంటే నేను పడలేను తల్లీ! ఏదో నా జీవితం దాని తోనే వెళ్ళిపోతోంది. సరేగానీ అబ్బాయీ! ఆ డ్రైవరును రేపు తొమ్మిదింటికల్లా ఇక్కడుండమని చెప్పు" అన్నారు దశరథరామయ్యగారు అక్కడనుంచి లేస్తూ.

'అబ్బబ్బ! చెప్తే అర్థం చేసుకోరు! ఇది నా ఒక్కదాని సమస్య కాదు నాన్నా! ప్రతీ ఆడపిల్లా పడే బాధ ఇది! ఎప్పటికైనా ఆడవాళ్ళను అర్థం చేసుకునే రోజు వస్తుం దా?' బాధగా అంటూ లోపలికి నడిచింది శైలజ.

❖ ❖ ❖

శైలూ మాటలు రామారావు మనసు పొరల్లో పేరుకుపోయిన భావాలని పైకి లాగుతున్నాయి. శైలజవన్నీ వాళ్ళ అమ్మ పోలికలు. పార్వతి కూడా ఇలాగే దెబ్బలాడుతూ వుండేది. ఎక్కడ తనకు అన్యాయం జరిగినా, ఎవరికైనా అన్యాయం జరిగినా చాలా బాధ పడిపోయేది. తన ఆఫీసులోని టైపిస్టు బీద తనాన్ని ఆసరాగా తీసుకుని ఆ అమ్మాయికి తను ఇచ్చే బహుమతులు, ఆశగా వాటికై ఎగబడే ఆ టైపిస్టు అమాయకత్వాన్ని చూసి పార్వతి, తన దురుద్దేశాన్ని గ్రహించి, తనను మార్చాలని ఎంతగానో ప్రయత్నించింది. చివరకు ఆ టైపిస్టు చెంపదెబ్బతో తన ప్రయత్నాలకి భరతవాక్యం పలికింపజేసింది. తనంటే పార్వతి చూపించే అభిమానం, ప్రేమ ఈ సంఘటనతో కొద్దిగా తగ్గిందనే చెప్పాలి. కానీ, తను పార్వతి మాటలను ఎప్పుడూ లక్ష్యపెట్టలేదు. స్త్రీ సౌభాగ్యానికి విలువ ఇచ్చే పార్వతి తనను భరిస్తూనే వచ్చింది.

❖ ❖ ❖

"నాన్నా! ఇందాకట్నుంచీ పిలుస్తున్నా! రండి, టిఫిను తిందాం. అయినా ఎందుకు మీరు అలా ఆలోచిస్తూ వుండిపోతూంటారు? ఏదైనా దీర్ఘ కాలిక పథకం వేస్తున్నారా?" అంటూ నవ్వింది.

"శైలూ! నీ మాటలకు నవ్వలేకుండా ఉండలేనమ్మా అవును, దీర్ఘ కాలిక పథకాన్నే వేస్తున్నాను- నీ పెళ్ళి గురించి,"

"అది దీర్ఘ కాలిక పథకమెట్లా అవుతుంది నాన్నా?"

"మంచివాడు రావాలి, నిన్నర్థం చేసుకోవాలి. పర స్పర ప్రేమాభిమానాలు కలగాలి. అతనికి తెలివితేట లుండాలి- అబ్బో ఎంత ఉంది!"

"ఆ.. ఆ.. సరే గానీ, ముందు కాఫీ తాగండి, చల్లారిపోతోంది"

"ఏరా! అబ్బాయీ! ఈ రోజు ఆఫీసుకు వెళ్ళలే దేమిటి?" అడిగాడు రామారావు తండ్రి. 'ఈరోజు ఒంట్లో బాగుండలేదు, రెస్టు తీసుకుంటాను' అంటూ తన గదిలోకి వెళ్ళి తలుపేసుకున్నాడు రామారావు. బీరువా తీసి బట్టలడుగున ఉన్న తమ పెళ్ళి ఫోటో తీసాడు. పార్వతిని చూస్తూ వుంటే జీవితంలో ఎంత పోగొట్టుకున్నాడో తెలుస్తోంది. జీవితంలో అస్సలు మధురానుభూతులనేవి లేకుండా చేసుకున్నాడు తను! తనకు తెలిసిన నీచ మయిన కోర్కెలే రసహృదయమని గర్వంగా విర్రవీగే వాడు. తండ్రి ఈ విషయాన్ని చూచాయగా గ్రహించినా, వ్యాపారంలో తను చూపించే శ్రద్ధ, పట్టుదల.. ఇవన్నీ చూసి గట్టిగా మందలించలేక పోయాడు. పైగా ఇవన్నీ వయస్సు లక్షణాలని భ్రమించేవాడు. కానీ, అది వ్యసనమని తెలుసుకోవటానికి ఎంతో కాలం పట్టలేదు. శైలజ పుట్టిన కొన్నాళ్ళకు తనకు మరో స్త్రీతో సాన్ని హిత్యం పెరుగుతూ వచ్చింది. పార్వతి దాన్నెంత మాత్రమూ ఓర్చుకోలేకపోయింది.

అవును మరి ఏ స్త్రీ అయినా దాన్ని క్షమించగలదా? పార్వతి మాట్లాడిన మాటలు ఇప్పటికీ మర్చిపోలేదు

"నా దురదృష్ట వశాత్తూ మీరు నీచమయిన కోరికలకు లొంగిపోయారు. ఈ కోరికల ననుభవించడానికి మీరు మనిషిగానే పుట్టనక్కర్లేదు. పశుపక్ష్యాదులు కూడా వీటిని

అనుభవిస్తూనే ఉన్నాయి. ధర్మార్థ కామమోక్షాల్లో కామాన్ని మోక్ష కామంగా చెప్పారు కానీ తుచ్ఛమైన కామాన్ని వారు చెప్పలేదు. 'నాతి చరామి-' అని మీరు చెప్పిన మంత్రార్థాన్ని త్రోసి పుచ్చి పరస్త్రీలతో గడుపుతున్న ఈ బ్రతుకు బ్రతుకు కాదు. గృహస్థాశ్రమంలో ఆలు బిడ్డలను రక్షించవలసిన బాధ్యత ఉంది. మీరు ఆ సంబంధాన్ని త్రోసిపుచ్చి విలువ ఇవ్వకుండా చేస్తున్నారు. సగటు భారత స్త్రీ దాన్ని ఎంతమాత్రం క్షమించదు. ఆడదాన్ని చులకనగా చూస్తూ, నేను కనుసైగ చేస్తే నా వైపు పరుగెత్తుకుంటూ వస్తుందన్న భ్రమలో మీరు వున్నంతకాలం మీరు మారరు' పార్వతి ఆవేశం నిజంగా చాలా భయమేసింది తనకు.

"అబ్బ! ఏమిటి పార్వతి ఈ ఉపన్యాసం! బోర్ కొట్టిస్తున్నావు? విషయం మార్చి ఇంకేదైనా చెప్ప కూడదా! ఆఁ అన్నట్లు రేపే మన వూటీ ప్రయాణం! రెడీగా ఉన్నావు కదా!" అన్నాడు వాతావరణాన్ని తేలిక చేస్తూ.

"నన్ను చెప్పనివ్వండి! ఇంతకాలం మీలో మార్పు ఆశించాను. ఇంక నాలో ఓపిక నశించింది. మీరు ఇంక మారరు. మీ స్వార్థాన్ని, కపట ప్రేమను భరించలేను. దాహం వేస్తే మంచినీటిని తాగితే దాహం చల్లారుతుంది కానీ, మురికినీటిని తాగితే దాహం తీరుతుందా?.."

"పార్వతీ! నా ఓపికను పరీక్షిస్తున్నావు! నువ్వు చేసిన హితబోధలు ఇక చాలు గానీ, ప్రయాణానికిరెడీగా ఉండు"

"సారీ! నేను రావడం లేదు. రేపు శివానందమహర్షి ఇక్కడకు వస్తున్నారు. నేను ఆయన ఆశ్రమంలో చేరు




తున్నానని ఆయనకు ముందుగానే వ్రాశాను. రేపు నా ప్రయాణం ఆశ్రమానికి."

పార్వతి నిర్ణయానికి ఆశ్చర్యపోయాడు రామారావు. "ఇదేమిటి పార్వతీ! ఇంత కఠినమైన నిర్ణయానికి వచ్చావు? శైలూని కూడా వదిలి వెళ్ళిపోతావా? ఇదేనా నీ మాతృప్రేమ! సంసారాన్ని వదిలేసి, ముక్కు మూసుకు జపం చేస్తూ కూర్చుంటే మోక్షం వస్తుందా? నేను చేసిన తప్పులన్నీ క్షమించ కూడ దా?" ప్రాధేయ పూర్వకంగా అడిగాడు రామా రావు.

"లేదండీ! ఇంక నా నిర్ణయం మారదు. నాజీవితం అలా వెళ్ళిపోవలసిందే," నిశ్చ లంగా అంది.

"పార్వతీ ఒక్కసారి ఆలో చించు. నిజమే! నేను తప్పు చేశాను. ఇంక బుద్ధిగా ఉంటాను. నిన్ను వదిలి నేను ఉండగలనా? నా ప్రేమను అర్థం చేసుకున్నది ఇంతేనా? నలుగురిలో నేను తలెత్తుకు తిరగగలనా? పార్వతి ఎక్క డికి వెళ్ళిందంటే లోకా నికి నేనేం జవాబు చెప్తాను? ఎందుకెళ్ళిందని అందరూ నన్ను అనుమానంగా చూస్తుం టే- ఓహ్! పార్వతీ దయచేసి ఈ ప్రయాణం ఆపుకో. స్త్రీకి క్షమ, త్యాగం, సహనం.. వంటివన్నీ సహజ లక్షణాలంటారే! మరి నీలో ఆ గుణాలే లేవా? నా కోసం, శైలూ కోసం నువ్వు"

తలుపు మీద ఎవరో టక టక కొడుతుంటే ఉలిక్కిపడి - ఆలోచనల్లోంచి తేరుకుని తలుపు తీశాడు రామారావు.

"ఏమిటి నాన్నా! మీకు ఒంట్లో. బాగుండలేదని తాతయ్య చెప్పారు. ఎలా ఉంది?"

"శైలూ అంత కంగారు పడాల్సిందేమీ లేదు. కొద్దిగా తలనొప్పిగా ఉంది. అంతే!"

"నాన్నా! ఒక్కమాట అడగనా?"

"అడుగమ్మా!"

"అమ్మ ఫోటోలో చాలా అందంగా వుంది కదా! నిజంగా ఇంకెంత అందంగా ఉండి ఉంటుందో కదా నాన్నా!" అంది చేతిలో వున్న పెళ్ళిఫోటోను చూస్తూ!

"ఆఁ ఆఁ! అందంగానే ఉంటుంది" కంగారు పడి పోతూ అన్నాడు ఫోటోను దాచేస్తూ.

"ఇప్పుడు అమ్మ వుంటే ఎంత బాగుండునో కదా! అందరూ మీ అమ్మ వెళ్ళిపోయిందంటే నాకెంతబాధగా వుంటుందో తెలుసా నాన్నా?" ఆవేదనగా అంది శైలజ.

రామారావుకు ఇందాక శైలూ అన్న మాటలు జ్ఞాపకం గుర్తుకొచ్చాయి. తన తప్పులే పార్వతిని ఇల్లు విడిచి వెళ్ళేలా చేసాయి. కానీ తనేం చేశాడు! లోకాన్ని తెలివిగా మోసం చేశాడు. లోకానికి అందమైన కథ చెప్పాడు. స్త్రీకిద్రోహం చేసాడు తను. పార్వతి ఇంటినుండి వెళుతూ తనవైపు చూసిన చూపులో ఎన్ని అర్థాలున్నాయో ఊహించుకోవడానికే భయమేస్తుంది. "మీ పెద్దరికం ఇదేనా?" అని తండ్రివైపు చూసిన చూపు ఆయన్ని నిలదీసింది. "ఇంత ద్రోహం చేయడం నీకు తగునా?" అన్న చూపులో తరతరాలుగా స్త్రీకి జరిగే అన్యాయం ఆచంద్ర తారార్కంగా ఉంటూనే ఉంటుంది. ఆ చూపులు తన్ను జీవితాంతం వెంటాడుతూనే వుంటాయి. స్త్రీని గౌరవించలేని, స్త్రీని అర్థం చేసుకోలేని, స్త్రీకి న్యాయం చేకూర్చలేని సంస్కారవంతుల సమాజం ఎప్పుడూ ఇట్లా ఉంటుందని కూతురి తరం, ఆతర్వాతి తరం.. ఇలాగ జరగవలసిందేనా? నో! అలా జరగడానికి వీల్లేదు. అహాన్ని, ఆశను జయించలేని వాళ్ళ జీవితాలు దుఃఖభాజనమవుతాయనే నిజాన్ని గ్రహించగలిగినతను శైలూతో నిజం చెప్పేస్తే, పురుష అహంకారాన్ని తగ్గించుకుంటే.. చాలు ఈ జీవితానికి!